

తాడిపత్రిలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



గుత్తి బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



గుత్తిలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

తాడిపత్రి రూరల్: సకాలంలో ఆర్టీసీ బస్సులు లేక గురువారం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తాడిపత్రి పట్టణం మూడు జిల్లాల కేంద్రం కావడంతో రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కర్నూలులో జరుగుతున్న సూపర్ జీఎస్టీ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రావడంతో తాడిపత్రి డిపో నుంచి ఎక్కువ బస్సులను జనసేకరణ కోసం అధికారులు పంపారు. తాడిపత్రి ఆర్టీసీ డిపోలో 90 బస్సులుండగా వాటిలో 15 వివిధ కారణాలతో షెడ్‌కు పరిమితమయ్యాయి. ప్రైవేట్‌కు చెందిన 40 అద్దె బస్సులు ఉన్నాయి. మొత్తం 60 బస్సులను జనసమీకరణ పేరుతో బుధవారం రాత్రి కర్నూలు జిల్లాకు పంపించారు. మిగిలిన బస్సులతో సర్వీసులు నడపడం అధికారులకు ఇబ్బందిగా మారింది. అరగంటకు ఒకసారి బస్సులను ఆయా ప్రాంతాలకు నడిపేవారు. గంటసేపు అయినా కొన్ని చోట్లకు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్, కర్నూలు జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన బస్సులు సైతం అరకొరగా రావడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు పోటీపడ్డారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ప్రయాణికులు ఫుల్..
బస్సులు నిల్

గుత్తి: గుత్తి బస్టాండ్‌లో బస్సుల కోసం గురువారం ప్రయాణికుల పడిగాపులు కాశారు. బస్సులన్నింటినీ కర్నూలులో జరిగిన కూటమి సభకు తరలించారు. దీంతో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మూడు, నాలుగు గంటలు వేచి ఉన్నా బస్సులు రాలేదు. దీంతో అత్యవసర పనులు ఉన్న ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ప్రయాణికులను రద్దీని ఆసరాగా భావించి ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేశారు.



తాడిపత్రి బస్టాండ్‌లో నార్పల బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు
విద్యా సామగ్రి అందజేస్తున్న రొటేరియన్లు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సరోజిని నాయుడు మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్) పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గురువారం రోటరీక్లబ్ ప్రతినిధులు స్టడీమెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సు. దీర్‌కార్వా, రవి, రోటరీ ప్రతినిధులు శిరీష్, ఉమావక్కల, జి.శ్రీనివాసులు, శ్రీనాథ్, రామాంజనేయులు, శివానంద, పాఠశాల హెచ్ఎం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

గుంతకల్లు రూరల్: రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నల్లదాసరపల్లిలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ ప్రేమ్‌చంద్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి డాక్టర్ జి.వెంకటేష్, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ టీ నగ మల్లేశ్వరరావు, ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకుడు పద్మనాభరావు తదితరులు పాడి పశువుల నిర్వహణ, పెయ్య దూడలు పుట్టే వీర్యం అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసాల సాగు, వాటి ఆవశ్యకతను వివరిస్తూ ఉపాధిహామీ పథకం కింద వందశాతం సబ్సిడీతో పశుగ్రాసం పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడి రైతులకు రూ.25 వేల విలువచేసే మందులను అందజేశారు.

వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: వ్యాపార రంగంలో రాణించాలనుకున్న యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఏపీ టిడ్కో హౌసింగ్ అధికారి మద్దయ్య సూచించారు. గురువారం కళాశాల వాణిజ్య విభాగపు అధిపతి డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశ్రామిక ఔత్సాహికత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. సరికొత్త టెక్నాలజీని వినియోగించుకుని లాభదాయకమైన వ్యాపారాలను ప్రారంభించి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గోపినాయక్, డాక్టర్ నాగరాజు, జమీలబీబీ, అల్తాఫ్, రాజశేఖర్, శివప్రసాద్, జహారుల్లా పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పామిడి: మండల మహాసభను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మల్లేసు, ముత్యాలు, పీట్ల వద్దే శివకుమార్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మండల భవన కార్మిక సంఘం మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. సభకు మండలంలోని భవన నిర్మాణ కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. అనంతరం మహాసభకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు మాబు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యపై చంద్రబాబు కుట్ర



మాట్లాడుతున్న సమన్వయకర్త శైలజానాథ్



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

గార్లదిన్నె: పేదలకు వైద్య విద్య అందకుండా చేయాలనే దుర్బుద్ధితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. గురువారం గార్లదిన్నెలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణ నిర్ణయం వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.లక్షల కోట్లు విలువైన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసి 63 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీక రణకు వ్యతిరేకంగా ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకూ కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు ఈ నెల 28న శింగనమల నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించే భారీ ర్యాలీలో అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, జంబుల దిన్నె సొసైటీ మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అట్టే శీన, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లారెడ్డి, నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, నియోజక వర్గ బూత్ కమిటీ అధ్యక్షుడుఓబిరెడ్డి ,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా ఇవ్వండి

యాడికి: మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లోని ఉపాధి పనులకు వచ్చే కూలీలకు సక్రమంగా వేతనాలివ్వాలని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 16 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలుఇబ్బందులు పడుతున్నారన్నారని, ఈ విషయంలో ఏపీఓ మద్దిలేటి పట్టించేకోలేదన్నారు. మూడు నెలలుగా మండల స్థాయి అధికారులు ప్రజలకు అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీడీఓ వీర్రాజు, కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి, తూట్రాళ్ల పల్లి సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, ఎంపీటీసీలు రాగుల పార్వతి, నాగమణి, వెంకట నాయుడు, అవుకు నాగరాజు, రామ్మోహన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న
ఎంపీపీ బొంబాయి ఉమాదేవి

విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

గుంతకల్లుటౌన్: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17 నుంచి చేపట్టే విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు తాము మద్దతు తెలుపుతున్నట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకేనాగరాజు తెలిపారు. గురువారం ఆలూరురోడ్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మిక సంఘం నాయకుడు ఎస్‌కే ఎం బాషా, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు...రక్షణ మరిచారు!



తాడిపత్రి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట
నీరు లేక ఎండిన మొక్క



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రక్షణ
కవచం ఉన్న చోట కనిపించని మొక్క

తాడిపత్రిటౌన్: మొక్కలు నాటుదాం– పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు వల్లె వేస్తుంటారు. అయితే అది ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఇందుకు తాడిపత్రి ఎంపీడీఓ కార్యాలయం నిదర్శనంగా నిలుస్తోంది. ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటుతున్నారు కాని వాటి సంరక్షణ పట్టించుకోకపోవడంతో అవి మొక్క దశలోనే ఎండిపోతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు వున్న చోట రక్షణ కవచాలు లేవు.. రక్షణ కవచాలు ఉన్న చోట మొక్కలు నీరు లేక ఎండిపోయాయి. కార్యాలయాల్లోనే ఈ పరిస్థితి ఉంటే ఆరు బయలు ప్రదేశాలు, రోడ్ల పక్కన నాటే మొక్కల పరిస్థితి ఏంటని కార్యాలయానికి వచ్చే ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

డ్రోన్ సాయంతో మందుల పిచికారీ

శింగనమల(నార్పల): డ్రోన్ సహాయంతో ఎరువులు, మందులు సమానంగా పిచికారీ చేయవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం నార్పల మండలంలోని గొల్లపల్లిలో లక్ష్మీ నరసింహ స్వామి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కిసాన్ డ్రోన్ పరికరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ డ్రోన్ ద్వారా ఎరువులు, మందులు పిచికారీ చేయడం వల్ల వ్యయం తగ్గుతుందని, సమయం ఆదా అవుతుందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం సబ్సిడీతో రైతులకు డ్రోన్‌లు పంపిణీ చేస్తామన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ ఆధునాతన సాంకేతికతను వినియోగించి, తక్కువ వ్యయంతో ఆధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో నార్పల స్టేట్ బ్యాంక్ మేనేజర్ సందీప్, మండల వ్యవసాయాధికారి చన్నవీరస్వామి, ఏపీఎం తిప్పయ్య, నార్పల ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, ఎఫ్‌పీఓ ప్రతినిధులు షర్మిల, హసీనా, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న
జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



బుక్కరాయసముద్రంలో
ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పెద్దవడుగూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో
అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పర్వీన్ అన్నారు. గురువారం మండలంలోని కొర్రపాడు ఎస్సీ కాలనీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వివాహం చేయాలంటే ఆడపిల్లలకు 18 సంవత్సరా లు, మగ పిల్లలకు 21 సంత్సరాలు పూర్తి నిండాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఆడ, మగ అన్ని రంగాల్లో సమానమన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌బాబు, శ్రీదేవి, కేశవయ్య, త్రివేశ్వరమ్మ, రమేష్, రమాదేవి, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి సూచించారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్న పిల్లల్లో ఊబకాయం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బాల్య వివాహాలు చేయడం వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలో ఆర్‌అండ్‌బీ స్థలం

- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆర్‌అండ్‌బీ స్థలం అక్రమణలపై అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ రాముడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆర్ అండ్‌బీ స్థలంలో కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా బంకులు ఏర్పాటు చేశారన్నారు. స్థల ఆక్రమణ విషయంపై ఎంపీడీఓ యోగానంద రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా..ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఆ స్థలం మా పరిధిలో లేదని, ఆర్ అండ్‌బీ పరిధిలో ఉందని, అక్కడకు వెళ్లి అధికారులను కలవాలన్నారు. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో ఆర్ అండ్‌బీ అధికారులకు వినతి పత్రం అందజేశామన్నారు. కానీ ఆర్ అండ్ బీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్య పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో మండలంలో ఆర్ అండ్ బీ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ సీపీఐ ఆక్రమించుకొని పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ఆయన హెచ్చరించారు.

వృథాగా ప్యూరిఫైడ్ ట్యాంక్



గుంతకల్లు: స్థానిక రైల్వే జంక్షన్‌లోని 7వ నంబర్ ప్లాట్‌ఫారంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ ట్యాంక్ వృథాగా వదిలేశారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ ట్యాంకు గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు ద్వారా లేదా బాటిల్ కొని నీరు తాగుతున్నారు. సంబంధిత విభాగపు అధికారులు దృష్టి సారించి వాటర్ ప్యూరిఫైడ్ ట్యాంకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. తద్వారా ప్రయాణికులకు స్వచ్ఛమైన, కూలింగ్ తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు.

'కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలి'

గుత్తి: కర్నూలును న్యాయ రాజధాని చేయాలని, శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టును ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించడంతో పాటు హైకోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటన్నింటినీ తుంగలో తొక్కిందని విమర్శించారు. ప్రతి పక్ష నాయకులపై విమర్శలు మానుకుని, అభివృద్ధి పనులు చేయాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి, వెంకీ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

శింగనమల(నార్పల): నార్పలలోని నవీన్ మొబైల్ దుకాణం నిర్వాహకుడు అప్పులబాధతో విష రసాయనం తాగి గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి, వెంటనే అతడిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై నార్పల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

గార్లదిన్నె: పశు సంవర్ధక శాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆ శాఖ జేడీ ప్రేమ్‌చంద్ ఆదేశించారు. గురువారం గార్లదిన్నె పశు వైద్య శాలను జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశు వైద్యసిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి పాడి పశువులకు వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే పశువైద్య శాఖ కార్యక్రమాల పురోగతిపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను సకాలంలో వేయాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన



కంప్యూటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న
క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్ శైలజ

పెద్దపప్పూరు: మండలంలోని పసలూరులోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యశాఖ క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్ శైలజ సందర్శించి రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పెద్దపప్పూరు పీహెచ్‌సీ వైద్యురాలు ప్రీతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమీల, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాష్ వలి, పసలూరు అశ్విన్, ఎంఎల్ హెచ్‌పీ పల్లవి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే కేసు

యల్లనూరు: పోలీసుల అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రాము, ఎస్ఐ రామాంజనేయరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా దీపావళి పండుగ సందర్భంగా టపాసులు అనుమతులతోనే విక్రయించాలన్నారు. అనుమతుల్లేకుండా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ నెల 19లోపు తహసీల్దారు, పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. దీపావళి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. చిన్న సమస్యలను పెద్దవి చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

గార్లదిన్నె: మండల సర్వ సభ్య సమావేశం సభ్యుల కోరం లేక వాయిదా వేసి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యుల కోరం లేక పోవడంతో మధ్యాహ్నానికి వాయిదా వేశామన్నారు. మధ్యాహ్నం కూడా సభ్యులు ఎవరూ రాక పోవడంతో సమావేశం వాయిదా వేశామన్నారు. శుక్రవారం జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

రాయితీ పప్పుశనగ కోసం రైతుల ఎదురుచూపులు

యల్లనూరు: రాయితీ విత్తన పప్పుశనగ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అక్టోబరు నెలాఖరులోగా రైతులకు రాయితీ పప్పుశనగ విత్తనాలను సరఫరా చేస్తే ...8 వేల ఎకరాల కు పైగా పప్పుశనగ పంట సాగు చేస్తారు. ఏడీఏ రవి, ఇన్‌చార్జ్ ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డికి రైతులు ఫోన్లు చేసి పప్పుశనగ విత్తనాలు ఎప్పుడు పంపిణీ చేస్తారని అడుగుతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి రాయితీ పప్పుశనగను పంపిణీ చేయాలని జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి, కృష్ణాపురం, గడ్డంవారిపల్లి తదితర గ్రామాల రైతులు కోరారు.

'సూపర్ జీఎస్టీ'ని సద్వినియోగం చేసుకోవాలి

తాడిపత్రి రూరల్: సూపర్ జీఎస్టీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంవీఐ శ్రీనివాసులు సూచించారు. సూపర్ జీఎస్టీపై గురువారం ఎంవీఐ కార్యాలయం నుంచి సీబీరోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల అవసరాల నిమిత్తం వివిధ వస్తువులపై జీఎస్టీని తగ్గించిందన్నారు. ర్యాలీలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, డీలర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం అండర్–17 బాల, బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ప్రేమ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా వాలీబాల్, యోగా, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు.